సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 26 । సెప్టెంబర్ । 2025



కమనీయం.. లక్ష్మీనరసింహుని కల్యాణం

స్వాతి నక్షత్రం రోజు కావడంతో తరిగొండలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం గురువారం వైభవంగా జరిగింది. - 10లో



వరుస చోరీలతో వణకుతున్న గుర్రంకొండ

గుర్రంకొండ పట్టణంచోరీలతో వణికిపోతోంది. మరోవైపు బయట రాష్ట్రాల నుంచి వ్యక్తుల సంచారంతో ప్రజలు భయపడుతున్నారు. - 10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.170	రూ.210
రెండోరకం	రూ.110	రూ.160



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 190 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	620	620
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 197.320 కిలోలు

న్యూస్‌రీల్

నేడు కలెక్టర్ సమీక్ష

మదనపల్లె : మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల అధికార యంత్రాంగంతో కలెక్టర్ నిశాంత్ కుమార్ శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశంలో వివిధ అంశాలతోపాటు, తాగునీటి సమస్య, ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్షిస్తారని తెలిసింది. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి అధికారులు హాజరుకానున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి టౌన్ : మౌలానా అబుల్ కలాం ఆజాద్ జాతీయ స్థాయి పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి హిదాయతుల్లా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్, సెక్రటరీ షేక్ గౌస్ పీర్ ఆధ్వర్యంలో నవంబర్ 11న అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఉర్దూ భాషాభివృద్ధి, సాహిత్యానికి సంబంధించి వివిన్న విభాగాల్లో అత్యుత్తమ సేవలు అందించిన వారికి అవార్డులు అందజేస్తారన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను విజయవాడలోని రాష్ట్ర ఉర్దూ అకాడమి డోర్ నంబర్76-1-06ఏ/1, 2 మాళవిక విల్లా, హెచ్‌బీ కాలనీ, భవానీపురం -520012 చిరునామాకు పంపాలని సూచించారు.

4న వాహనాల వేలం

రాయచోటి టౌన్ : రవాణాశాఖ అధికారులు తనిఖీల్లో పట్టుకున్న వాహనాలను అక్టోబర్ 4వ తేదీ వేలం వేస్తున్నట్లు జిల్లా రవాణాశాఖ అధికారి ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని రాజంపేట ఆర్టీసీ డిపోలో అక్టోబర్ 4వ తేదీ ఉదయం 10 గంటలకు వేలం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ధరావత్తు రూ.5 వేలు చెల్లించి (చలానా పొందాలి) వేలంలో పాల్గొనవచ్చన్నారు. ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ చూపించి టోకెన్ పొందాలని సూచించారు. వేలానికి సిద్ధంగా ఉన్న వాహనాల వివరాలు జిల్లా రవాణాశాఖ కార్యాలయంలోని నోటీస్ బోర్డులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



ఎరువుల తయారీని పరిశీలిస్తున్న రాధమ్మ

పీలేరు : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండగలమని డీపీవో రాధమ్మ అన్నారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏక్ దిన్ - ఏక్ గంట - ఏక్‌సాత్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్థానిక కడప రోడ్డులో గార్బేజ్ క్లీనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇళ్లలో సేకరించిన చెత్తను బయోడిగ్రేడబుల్ వ్యర్థాలతో ఎరువులుగా తయారు చేయాలని సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేశ్వరి, డిప్యూటీ ఎంపీడీవో సిగ్బతుల్లా, గ్రామ పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

12వ పీఆర్సీ ప్రకటించాలి



మాట్లాడుతున్న సాయిశంకర్‌రెడ్డి, బాలకృష్ణమూర్తి

మదనపల్లె రూరల్ : 12వ పీఆర్సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా కార్యదర్శి గురుప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ సాయిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉద్యోగుల సమస్యలపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గోపతి బాలకృష్ణమూర్తి, అధ్యాపకులు రమణ, రెడ్డెప్పరెడ్డి, శివపార్వతీదేవి, శ్రీదేవి, సతీష్‌రెడ్డి, నాయుడు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు గడువు

కడప సిటీ : మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం కింద మొక్కల పెంపకానికి 100 శాతం సబ్సిడీతో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెలాఖరు వరకు గడువు ఉందని, ఆసక్తి, అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని డ్వామా పీడీ బి.ఆదిశేషారెడ్డి తెలిపారు. ఇప్పటివరకు 1250 మంది రైతులు 2742 ఎకరాలకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. 920 మంది రైతులకుగాను 2058 ఎకరాల్లో ప్లాంటేషన్ ప్రారంభించినట్లు తెలిపారు. 103 మంది రైతులకుగాను 134 ఎకరాలకు సంబంధించి గుంతలు తీసి మొక్కలు నాటాల్సి ఉందన్నారు. ఈనెలాఖరు వరకు గడువు ఉందని తెలిపారు. మరిన్ని వివరాలకు ప్లాంటేషన్ మేనేజర్ ప్రతాప్ 90008 90293 నంబర్లో సంప్రదించాలని సూచించారు. మండలాల్లో సంబంధిత ఏపీఓలను కలవొచ్చని తెలిపారు.

ఆవేదన..ఆందోళన

- కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఒక్క డీఏ కూడా ఇవ్వని వైనం
- ప్రభుత్వ తీరుపై మండిపాటు
- ఆందోళన బాటలో ఉద్యోగులు



నిరసన తెలియజేస్తున్న విద్యుత్ జేఏసీ నాయకులు (ఫైల్)

మదనపల్లె సిటీ : ప్రభుత్వ తీరుపై ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. సమస్యలు పరిష్కరించాలని అధికారులకు, ప్రభుత్వ పెద్దలకు వినతులు ఇచ్చినా స్పందించలేదు. దాదాపు 16నెలల కాలంలో చెల్లించాల్సిన డీఏ బకాయిలు ఎక్కడివక్కడే ఉండిపోయాయి.దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రతి నెల రూ. 10 వేల వరకు నష్టపోతున్నారు. మొదటివిడత వివిధరూపాల్లో ఆందోళన చేసిన ఉద్యోగులు రెండో విడతలో నిరసనలు మరింత తీవ్రతరం చేయనున్నారు.

రోడెక్కుతున్న ఉద్యోగులు

కూటమి ప్రభుత్వంపై ఉన్న భ్రమలు ఉద్యోగుల్లో తొలగుతున్నాయి.దీంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోడ్డెక్కుతున్నారు. జిల్లాలో విద్యుత్ ఉద్యోగులు నిరసనలు చేపట్టారు. జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు. ఉద్యమ రణభేరి పేరుతో ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన బాటపట్టాయి. జిల్లాలోని వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు నిరసన గళం వినిపించారు. ఆయా ఎంపీడీఓలకు వినతిపత్రాలు అందజేశారు. ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఉద్యమం చేసే యోచనలో ఉన్నారు.1వ తేదీ వేతనాలు ఇవ్వడం మినహా ఎలాంటి ప్రయోజనం లేదనే అసంతృప్తిలో ఉద్యోగులు రగిలిపోతున్నారు. కూటమి ప్రభుత్వంపై ఒక్క ఉద్యోగి కూడా సంతృప్తిగా లేరనడంలో ఎంతమాత్రం అతిశయోక్తి కాదు.

కూటమి ప్రభుత్వంలో ఇవీ కష్టాలు..

- ఏపీజీఎల్ఐ లోన్, ఫైనల్ పేమెంట్లు పూర్తిగా నిలిచిపోయాయి.
- 10 నెలలుగా మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు ఇవ్వడం లేదు.
- మూడు సరండర్ లీవ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి.
- 2024 అక్టోబర్ నుంచి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు గ్రాట్యుటీ ఇవ్వడం లేదు
- డీఏ అరియర్స్, పీఆర్సీ అరియర్స్ పెండింగ్‌లో ఉండిపోయాయి.
- కూటమి ప్రభుత్వం ఏర్పాటై 16 నెలలు అవుతున్నా ఐఆర్ ఊసే లేదు
- 12వ పీఆర్సీ గురించి ఆలోచించిన దాఖలాలే లేవు.

వైఎస్సార్ సీపీ హయాంలో...

2019 వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కొద్ది రోజులకే ఉద్యోగ, ఉపాధ్యాయ,కార్మికులకు 27 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) ఇచ్చారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ తనపని మొదలు పెట్టే సమయానికి ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో నిలిచిపోయింది. తదనంతరం పీఆర్సీ కమిషన్ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు.

పెండింగ్ డీఏల వివరాలు

(ఇప్పుడు తీసుకుంటున్న డీఏ 33.67శాతం)

- 2024 జనవరిలో 3.64 శాతం డీఏ ఇవ్వాల్సి ఉంది (33.67 శాతం నుంచి 37.31 శాతం)
- 2024 జులైలో 2.73 శాతం డీఏ ఇవ్వాల్సి ఉంది. (37.31 శాతం నుంచి 40.04 శాతం)
- 2025 జనవరిలో 1.82 శాతం డీఏ ఇవ్వాల్సి ఉంది. (40.04 శాతం నుంచి 41.86 శాతం)
- 2025 జులై 2.73 శాతం డీఏ ఇవ్వాల్సి ఉంది. (41.86 శాతం నుంచి 44.59 శాతం)

ఉద్యోగులకు చెల్లించాల్సిన 4 ఏడీల మొత్తం 10.92 శాతం

పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు కావస్తున్నా ఇంతవరకు ఉద్యోగ, ఉపాధ్యాయ,కార్మికుల పెండింగ్ బకాయిలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఉపాధ్యాయ సంఘాలన్నీ ఒకేతాటిపై వచ్చి ఫెడరేషన్‌గా ఏర్పడ్డాయి. వచ్చే నెల రాష్ట్ర స్థాయిలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తాం.

– రెడ్డప్పరెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షులు

పరాశక్తి పాహిమాం..

దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు వివిధరూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లిని దర్శించుకుని పరవశించిపోయారు. ఆది పరాశక్తి..పాహిమాం అంటూ వేడుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



మదనపల్లె : అన్నపూర్ణదేవిగా వాసవీకన్యకా పరమేశ్వరి



మదనపల్లె : అమ్మవారికి నమస్కారం చేస్తున్న మహిళలు



రాయచోటి: అన్నపూర్ణేశ్వరీ దేవి అలంకరణలో శ్రీ భద్రకాళీ అమ్మవారు



రాజంపేట : వాసవిమాతను ఊరేగిస్తున్న భక్తులు

పొలిటికల్ అడ్వైజరీ కమిటీలోకి చింతల

సాక్షి రాయచోటి/పీలేరు : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ బలోపేతం చేస్తూనే మరోవైపు కార్యకర్తలు, శ్రేణులు, నేతలను మాజీ సీఎం,వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యోన్ముఖులను చేస్తున్నారు. ఇదే తరుణంలో వ్యవహరించాల్సిన విధానాలపై ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తూనే ప్రజా పోరాటాలకు దిశా నిర్దేశం చేస్తున్నారు. పార్టీలో కీలకంగా వ్యవహరిస్తూ సీనియర్ నాయకులుగా గుర్తింపు పొందిన వారికి వైఎస్సార్ సీపీ పదవులను కట్టబెడుతోంది. ఈ నేపథ్యంలో సీనియర్ నేత, పీలేరుమాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ మెంబర్‌గా అవకాశం కల్పించారు.

అన్నమయ్య జిల్లా పీలేరుకుచెందిన మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. చింతల రామచంద్రారెడ్డి తండ్రి చింతల సురేంద్రారెడ్డి కూడా మంత్రిగా, ఎమ్మెల్యేగా సేవలు అందించారు. రాజకీయ ప్రాబల్యం కలిగిన చింతల కుటుంబం ఎప్పుడూ ప్రజా సేవలోనే ఉంటోంది. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ మంచి గుర్తింపు పొందిన చింతల రామచంద్రారెడ్డికి పార్టీలో కీలక పదవి దక్కడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పీఏసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వయిజరీ కమిటీలో కీలకమైన స్థానం రావడానికి కృషి చేసిన చిత్తూరు జిల్లా పుంగనూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలకు చింతల రామచంద్రారెడ్డి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే తనపై నమ్మకముంచి అడ్వయిజరీ కమిటీలో కీలక పదవి ఇచ్చిన పార్టీ అధినేత వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటానని చింతల తెలియజేశారు. ఎప్పుడూ ఏ అవసరం వచ్చినా పీలేరు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోఉంటానని, ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు పోరాటాలే లక్ష్యంగా పనిచేస్తానని ఆయన 'సాక్షి' ప్రతినిధికి తెలియజేశారు.

వైఎస్ జగన్‌ను కలిసిన చింతల

కలికిరి : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాష్ట్ర మైనార్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ గురువారం విజయవాడలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మైనార్టీ కమిషన్ మాజీ చైర్మన్ కుమారుడు డాక్టర్ జుల్‌ఫికర్ అహ్మద్ ఖాన్(వకార్) వివాహ కార్యక్రమానికి మాజీ సీఎంను ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చింతల ఆనందరెడ్డి, డాక్టర్ మొహివుద్దీన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత జీవితంలో భాగం కావాలి

జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

రాయచోటి : 'అందరి జీవితంలో స్వచ్ఛత ఒక భాగం కావాలి.. మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.. ఇది నిత్య ప్రక్రియ.. నిరంతరం సాగాలి' అని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం రాయచోటిలోని వీరభద్ర స్వామి ఆలయం నుంచి మార్కెట్ యార్డు వరకు రోడ్లు, కాలువలను శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టారు. ఇందులో పారిశుధ్య కార్మికులతో పాటు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పాల్గొన్నారు. ఏక్ దిన్ ఏక్ గంట, ఏక్ సాథ్ అనే నినాదంతో దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు కలెక్టర్ చెప్పారు. ఇందులో మున్సిపల్ సిబ్బంది, పబ్లిక్ హెల్త్ వర్కర్స్, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు కలిసి ఒక గంట శ్రమదానం చేసి శుభ్రత కోసం కృషి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి, ఎల్‌డీఎం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



రాయచోటి పట్టణ వీధుల్లో చెత్తను తొలగిస్తున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నీటిపారుదల శాఖ ఎస్ఈ, ఈఈలు, డీఈఈ, ఏఈఈ, ఏఈలతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జీఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలు, శ్రీనివాసపురం రిజర్వాయర్, అడవిపల్లి రిజర్వాయర్, అన్నమయ్య ప్రాజెక్టు, వెలిగల్లు ప్రాజెక్టు, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, పింఛా, ఝరికోన, బహుదా, పెద్దేరు ప్రాజెక్టులకు సంబంధించిన పలు అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ, భూసేకరణకు సంబంధించిన గ్రామం, మండల, విస్తరణ వివరాలను తెలియజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

గుట్టల్లో గుట్టుగా విద్యార్థుల 'షూ'లు

పెద్దతిప్పసముద్రం : జిల్లాలోని పెద్దతిప్పసముద్రం నుంచి బి.కొత్తకోటకు వెళ్లే మెయిన్ రోడ్డు నుంచి ఒకటిన్నర కిలోమీటర్ దూరంలో ఉన్న బోడిగుట్ట వెనుక భాగాన గుట్టల నడుమ ఉన్న బీడు పొలాల్లో విద్యార్థుల పాదరక్షలు (షూలు) దర్శనమిచ్చాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కాళ్లకు ఉండాల్సిన షూలు పొలాల్లో ఉండటం గురువారం చూసి పశువుల కాపరులు అవాక్కయ్యారు. కొత్తగా ఉండటంతో అటుగా వెళ్లిన కొందరు వాటిలో కొన్ని జతలు తీసుకెళ్లినట్లు సమాచారం. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 500 జతలకు పైగా షూలను ప్లాస్టిక్ సంచుల్లో నింపి నాలుగు చక్రాల వాహనం ద్వారా నిర్మానుష్యంగా ఉండే ప్రదేశంలో ఎందుకు పడేశారో అర్థం కావడం లేదు. ఈ షూలు ఏ మండలానికి సంబంధించినవో తెలియాల్సి ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరై మిగిలిపోయిన షూలు అని కక్షపూరితంగా పడేశారా లేక విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో పడేశారా అనేది ప్రశ్నార్థకం. ఏది ఏమైనా వీటి కోసం వెచ్చించిన రూ.లక్షల ప్రజాధనం దుర్వినియోగం అయినట్లేనని పలువురు విమర్శిస్తున్నారు.



గుట్టల నడుమ పొలంలో పడేసిన షూలు

డిపోల అభివృద్ధిపై దృష్టి పెట్టాం!

- బస్టాండ్లలో మౌలిక వసతులను మెరుగుపరుస్తాం
- పీటీడీ వైస్ చైర్మన్, ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు

మైదుకూరు : రాష్ట్రంలోని పీటీడీ(ఆర్టీసీ) డిపోలన్నింటినీ అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టామని సంస్థ వైస్ చైర్మన్, ఎండీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన మైదుకూరు డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో డిపోలను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. గుడివాడ డిపోలో పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గుత్తి డిపో అభివృద్ధిని కూడా చేపట్టామని తెలిపారు. పీటీడీ స్వయంగా చేయడం లేదా పీపీపీ ద్వారా చేసే ఆలోచనలో ఉన్నట్టు వివరించారు. ఆగస్టు 15న ప్రారంభించిన స్త్రీ శక్తి పథకం రాష్ట్రంలో సజావుగా, విజయవంతంగా సాగుతోందని తెలిపారు. బస్సుల్లో కొన్ని స్వల్ప సంఘటనలు జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. పీటీడీ బస్టాండ్లలో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎండీ వెల్లడించారు. వర్షం వస్తే మోకాళ్ల లోతు నీటితో ఉండే బస్టాండ్లు ఉన్నాయని, అలాంటి వాటిని బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మూడు నెలల్లో పీటీడీకి 1,050 ఎలక్ట్రికల్ బస్సులు రానున్నట్టు ద్వారకా తిరుమలరావు వెల్లడించారు. డిపో మేనేజర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్టాండులో అభివృద్ధి పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎండీ ద్వారకా తిరుమలరావు

ఇష్టంతో పనిచేయాలి

ప్రతి ఒక్కరూ ఇష్టంతో పనిచేయాలని ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు సూచించారు. గురువారం సాయంత్రం జిల్లా పర్యటనకు వచ్చిన ఎండీ కడప ఆర్టీసీ గ్యారేజీని రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెంగల్‌రెడ్డి (ఇంజనీరింగ్)తో కలిసి పరిశీలించారు. అధికారులకు పలు సూచనల చేశారు. కడప బస్టాండును ఆధునీకీకరించేందుకు రూ.1.30 లక్షలు మంజూరయ్యాయని,త్వరలో పనులు ప్రారంభించి 4నెలల్లో సీసీ రోడ్లు పూర్తి చేస్తామన్నారు. ఆర్టీసీ ఆర్ఎం పాలిమేర గోపాల్‌రెడ్డి, డిప్యూటీ సీటీఎం డిల్లీశ్వరరావు, ఆర్టీసీ వీఅండ్ఎస్ఓ ధర్మతేజ, ఈఈ శ్రీనివాసులు, డీఈ పోతురాజు, యూనియన్ నాయకులు పురుషోత్తం, ఏఆర్ మూర్తి పాల్గొన్నారు.


ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్‌లో కలపాలి

రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీలోని వివిధ విభాగాల్లో 8వ వేల మంది ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్నారని, వారిని ఆప్కాస్‌లో కలపాలని ఆయా ఉద్యోగులు ఎండీ ద్వారక తిరుమలరావును విన్నవించారు.

విశ్లేషణాత్మక ఆలోచన ముఖ్యం

ఆర్కేవ్యాలీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా

వేంపల్లె : విద్యార్థులు ఆవిష్కరణాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన.. ఉత్తమమైన శక్తిని కలిగి ఉండాలని, అప్పుడే అనుకున్న విజయాన్ని సాధించవచ్చని ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా అన్నారు. గురువారం స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2025 లో భాగంగా విద్యార్థులు అభివృద్ధి చేసిన వివిధ విభాగాల అప్లికేషన్లు ప్రదర్శించారు. దాదాపు 106 టీమ్‌లు ప్రదర్శనలు చేయగా.. ఇందులో 50 ఎంపిక చేశారు. ఎంపికైన టీమ్ సభ్యులను జాతీయ స్థాయికి పంపనున్నారు. అకడమిక్ డీన్ రమేష్ కైలాస్, ఎస్పీటీసీ కోఆర్డినేటర్ ఉదయశ్రీ పాల్గొన్నారు.



జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్ కుమారస్వామి తదితరులు

క్లుప్తంగా

మెట్లపై నుంచి జారిపడి వృద్ధురాలు మృతి


మృతిచెందిన వెంకటమ్మ

మదనపల్లె రూరల్ : మెట్లపై నుంచి జారిపడి వృద్ధురాలు మృతిచెందిన ఘటన పట్టణంలో గురువారం జరిగింది. టిప్పుసుల్తాన్ మైదానం సమీపంలో నివాసముంటున్న గంగిరెడ్డి భార్య వెంకటమ్మ(78) మిద్దెపై నుంచి కిందకు దిగుతూ జారి కిందపడిపోయింది. తీవ్రంగా గాయపడటంతో కుటుంబసభ్యులు వెంటనే బాధితురాలిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్స అందిస్తుండగా, పరిస్థితి విషమించి మృతి చెందింది. దీంతో కుటుంబసభ్యులు మృతదేహాన్ని ఇంటికి తీసుకువెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


రాజు

సంబేపల్లె : మండలంలోని చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై గురువారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వీర్లరాజు (29) మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని ముదినేనివడ్డిపల్లెకు చెందిన వీర్ల రాజు రాయచోటి చిత్తూరు రోడ్డు పక్కన హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో పంక్చర్ షాపు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే సొంత పనుల నిమిత్తం రాయచోటి నుంచి స్కూటర్‌లో తన గ్రామానికి వెళ్తున్నారు. మార్గమధ్యంలో నారాయణరెడ్డిపల్లెలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద ఎలాంటి సిగ్నల్ లేకుండా నిలబడిన లారీని ప్రమాదవశాత్తూ ఢీకొన్నాడు. రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పెద్ద దిక్కు చనిపోవడంతో కుటుంబీకులు బోరున విలపించారు.

యువకుడి ఆత్మహత్య

బి.కొత్తకోట : స్థానిక పీటీఎం రోడ్డుకు చెందిన గంగాధర్(33) విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా తిరుపతిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందగా పోలీసులు విచారిస్తున్నారు. ఓ యువతితో ప్రేమ వ్యవహారమే కారణమని చెబుతుండగా ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పవర్ బీఈతో విద్యార్థులకు ఉపయోగకరం

చాపాడు : విద్యార్థులకు పవర్ బీఈ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ఎంతో ఉపయోగమని హైదరాబాద్‌కు చెందిన రేష్ యాప్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ ప్రతినిధి నాగేంద్ర అన్నారు. స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కాలేజీ విద్యార్థులకు గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ పవర్ బీఈ అనేది ఒక అడ్వాన్స్‌డ్ ఎక్సెల్ నేర్చుకోవడంతో విద్యార్థులకు వివిధ రకాల ఉపయోగాలు ఉన్నాయన్నారు. ఉద్యోగాలు పొందాడానికి ఈ టెక్నాలజీ ఎంతో ఉపయోగపడుతుందని, బిజినెస్‌లో ఏదైనా నిర్ణయం తీసుకోవాలంటే ఈ డేటా మార్గదర్శకంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ లోహిత్‌రెడ్డి, డైరెక్టర్ అడ్మిన్ డా.జి.శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపల్ డా.ఎస్.శృతి పాల్గొన్నారు.

వరుస చోరీలతో వణుకుతున్న గుర్రంకొండ

గుర్రంకొండ పట్టణం వరుస చోరీలతో వణికిపోతోంది. గత కొన్ని రోజులుగా పట్టణంలో వరుస చోరీలు జరుగుతున్నాయి. ఓ వైపు గంజాయి ముఠా సభ్యులు మరోవైపు బయట రాష్ట్రాల నుంచి వ్యక్తుల సంచారంతో పట్టణ ప్రజలు హడలెత్తిపోతున్నారు.

చెలరేగిపోతూ చోరీలకు పాల్పడుతున్న దుండగులు


దుండుగులు చోరీలకు పాల్పడుతున్న శివారు ఇళ్లు

గుర్రంకొండ : పట్టణంలో దుండుగులు యథేచ్ఛగా వరుస చోరీలకు పాల్పడుతున్నారు. పట్టణం వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. దీంతో స్థానికంగా నివాసం ఏర్పాటుచేసుకొనే వారి సంఖ్య పెరిగిపోతోంది. నాలుగు మండలాల ప్రజలు ఇక్కడ ఇల్లు కట్టుకొని నివాసముంటున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా నిర్మిచుకొంటున్న ఇళ్లతోపాటు గ్రామానికి శివారు ప్రాంతాల్లో నివాసముండే ఇళ్లలో ఎక్కువగా చోరీలు జరుగుతున్నాయి. ఇటీవల నిర్మాణంలో ఉండే ఇళ్లలో చోరీలు ఎక్కువగా జరుగుతున్నామి. పది రోజుల కిందట స్థానిక బలిజగడ్డవీధిలో ని నాలుగు ఇళ్లలో వరుసగా రెండురోజులపాటు దుండుగులు చోరీలకు పాల్పడ్డారు. స్థానిక వైన్ షాపుపై భాగాన్ని కత్తిరించి మద్యం సీసాలను చోరీ చేశారు. బస్టాండులోని పలు దుకాణాల్లో వరుస చోరీలు జరిగాయి. పలు దుకాణాల పైకప్పులను కత్తిరించి చోరీలకు పాల్పడ్డారు. పట్టణంతో పాటు ఇందిరమ్మకాలనీ, జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం ఉన్న ప్రాంతాల్లో చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి.

పట్టణ శివారు ఇళ్లే టార్గెట్

పలువురు దుండగులు పట్టణ శివారులోని ఇళ్లనే ఎక్కువగా టార్గెట్ చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారు. ఇంటి నిర్మాణం వద్ద వస్తువులు ఉంచాలంటే ప్రజలు హడలెత్తిపోతున్నారు. పలువురు రాత్రిళ్లు కాపలా ఏర్పాటు చేసుకుంటున్నారు. వాటితోపాటు శివారు ప్రాంతాల్లో ఇల్లు నిర్మించుకున్న చోట ఎక్కువగా చోరీలు జరుగుతున్నాయి. చిన్న పిల్లల సైకిళ్లు, ఇళ్ల పరిసరాల్లో ఉంచిన వస్తువులను రాత్రిళ్లు చోరీ చేస్తున్నారు. రాత్రిళ్లు పట్టణ శివారు ప్రాంతాల్లో సంచరించాలంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బయట ప్రాంతాలకు చెందిన వ్యక్తులతోపాటు గంజాయి మత్తుకు అలవాటు పడిన పలువురు వ్యక్తులు ఈ చోరీలకు పాల్పడుతున్నట్లు ప్రజలు చెబుతున్నారు. గతంలో వీరు పలుమార్లు చోరీ చేసిన సంఘటనలు చోటుచేసుకొన్నాయి. వాటికి సంబంధించి పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీస్‌స్టేషన్‌కు చేరని కేసులు ఎన్నో ఉన్నాయి. చోరీలు జరిగినా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసేందుకు పలువురు భయపడి మిన్నుకుండిపోతున్నారు. దీంతో దుండుగులు పట్టణంలో యథేచ్ఛగా చోరీలకు పాల్పడుతుండడం గమనార్హం.

మహిళలకు తప్పని వేధింపులు

పట్టణంలోని మహిళలకు పలు రకాలుగా వేధింపులు తప్పడం లేదు. కొంతమంది సెల్‌ఫోన్‌లో మహిళల ఫొటోలు తీస్తూ వికృతానందం పొందుతున్నారు. మరో వైపు గంజాయి ముఠా సభ్యులు వీధుల్లో వేగంగా వాహనాలను నడపుతూ అడ్డు వచ్చిన మహిళలపై దాడులకు తెగబడుతున్నారు. మహిళలు వీధుల్లో సంచరించాలంటే భయపడుతున్నారు. ఇటీవల ఓ కామాంధుడు కొత్తపేట వీధిలో సంచరిస్తూ వీధుల్లో నడిచి వెళుతున్న మహిళల ఫొటోలు రహస్యంగా తీయసాగాడు. వీధి వెంబడి వెళుతున్న ఓ మహిళ అనుమానం కలిగి సదరు వ్యక్తి సెల్ ఫోన్‌ను లాక్కొంది. పరిశీలించగా అందులో తన ఫొటోలు ఉండడం గమనించి గట్టిగా నిలదీసింది. సరైన సమాధానం చెప్పకపోవడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకొని సదరు కామాంధుడికి దేహశుద్ధి చేశారు. కొంతమంది అతడి సెల్‌ఫోన్‌ను పూర్తి స్థాయిలో పరిశీలించగా పలు ప్రాంతాల మహిళల ఫొటోలు అందులో ఉండడంతో నివ్వెరపోయారు. కొందరు మహిళల ఫొటోలు వివిధ భంగిమల్లో తీసి ఉండడం గమనించారు. అతడి సెల్ ఫోన్‌లో సుమారు 500 మహిళల ఫొటోలు ఉండడం గమనార్హం. ఇందులో బస్టాండులో వివిధ దుకాణాల్లో పనిచేసే మహిళల ఫొటోలు ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. అసలు వీటిని తీయడం వెనుక మర్మమేమిటో అంతుచిక్కడం లేదు. దీని వెనుక ఎవరైనా ముఠా సభ్యులున్నారా అన్న కోణంలో పట్టణవాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు, మహిళలు కామాంధుడికి దేహశుద్ధి చేసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అప్పగించారు. ధైర్యంగా ఫిర్యాదు చేయలేదనే నెపంతో సదరు కామాంధుడిపై కేసు నమోదు చేయకపోవడం గమనార్హం.


బలిజగడ్డవీధిలో బీరువా పగులగొట్టి చోరీలకు పాల్పడిన దృశ్యం

చర్యలు తీసుకొంటాం

పట్టణంలో జరుగుతున్న చోరీలపె గట్టి నిఘా చేపట్టి చర్యలు తీసుకొంటాం. చోరీలకు గురైన ఇళ్లకు సంబంధించి యజమానులు ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటాం. ఇళ్ల పరిసరాల్లో ఎవరైనా అనుమానితులు సంచరిస్తుంటే తమకు సమాచారం ఇవ్వాలి.

– గజేంద్ర, స్టేషన్ ఇన్‌ఛార్జి, గుర్రంకొండ

నగలతో పరారీ

రాజంపేట : రాజంపేట పట్టణంలో షఫీ అనే నగల తయారీ పలు బంగారు దుకాణాల నుంచి తయారీకోసం నగలు తీసుకుని వెళ్లి కనిపించడంలేదని దుకాణాల యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈడిగపాలెం గ్రామానికి షఫీ బంద్రాళ్ల వీధిలోని పలువురు బంగారు దుకాణాలకు నగలు తయారు చేసి ఇస్తున్నారు. దాదాపు రూ.50 లక్షలు విలువగల నగలు తీసుకుని కనిపించడం లేదని వ్యాపారులు పోలీసులకు తెలిపారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్‌కు జరిమానా


రైతులతో మాట్లాడుతున్న అధికారులు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని ఆవులరెడ్డిపల్లి సమీపంలోని ఏటిలో కొందరు అక్రమార్కులు ఇసుక అక్రమంగా తోడి కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నారని పీజీఆర్‌ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు ఇటీవల రైతులు ఫిర్యాదు చేసారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దారు విద్యాసాగర్, భూగర్భ గనుల శాఖ టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేష్, ఆర్ఐ చినపరెడ్డి ఇసుక నిల్వలు ఉన్న ఏటిని సందర్శించి రైతులతో సమీక్షించారు. తనిఖీ సమయంలో ఇసుక తరలింపునకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్ పట్టుబడడంతో యజమానికి రూ.10వేల జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు.

కమనీయం.. లక్ష్మీనరసింహుని కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు


పవిత్ర మాలలతో స్వామి, అమ్మవార్లు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణోత్సవం గురువారం కన్నుల పండువగా జరిగింది. స్వాతి నక్షత్రం రోజు కావడంతో ఆలయంలో చలువపందిళ్లు, పచ్చని తోరణాలతో పెళ్లివేదిక అలంకరించారు. ముందుగా మూలవర్లకు అభిషేకం, అర్చనలు, పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామికి క్షీరాభిషేకం నిర్వహించారు. రంగురంగుల పుష్పాలతో స్వామిని అలంకరించి వేద మంత్రోచ్చారణ మధ్య శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. పాల్గొన్న దంపతులకు టీటీడీ పట్టు వస్త్రాలు, కంకణాలు, స్వామి ప్రసాదాలు అందజేశారు.

ముగిసిన పవిత్ర ఉత్సవాలు : గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్ర ఉత్సవాలు నేటితో ముగిశాయి. ఈ సందర్భంగా హోమాలు నిర్వహించి మహా పూర్ణాహుతి గావించారు. ఉత్సవాలు ముగిసినందున వరుణదేవుడ్ని ఆహ్వానిస్తూ పవిత్ర జలాలతో స్వామివారికి చక్ర స్నానం చేయించారు. అనంతరం వాహనంలో కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపారు. పెద్ద ఎత్తున భక్తులు చేరుకొని స్వామికి పూజలు నిర్వహించారు. అర్చకులు గోపాలబట్టర్, కృష్ణ, రాజు, గోకుల్‌స్వాములు పాల్గొన్నారు.

పీలేరును రెవెన్యూ డివిజన్‌గా చేయాలి


సమావేశంలో పాల్గొన్న నాయకులు

పీలేరు రూరల్ : పీలేరును రెవెన్యూ డివిజన్ చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక మూన్‌లైట్ ఫంక్షన్ హాల్‌లో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులతో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ గత వందేళ్లుగా ప్రజల సమస్యలు చెప్పుకోవడానికి చిత్తూరు, మదనపల్లె, రాయచోటికి పీలేరు వాసులు తిరగాల్సి వస్తోందన్నారు. మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె, పుంగనూరును కలుపుకొని మదనపల్లె జిల్లాగా చేస్తూ, రొంపిచెర్ల, పులిచెర్ల, సోమల, కలికిరి, గుర్రంకొండ, వాల్మీకిపురం, కేవీపల్లె, పీలేరు, యర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు మండలాలను కలిపి పీలేరు రెవెన్యూ డివిజన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోటపల్లె బాబురెడ్డి, ఎస్.సుధాకర్‌బాబు, పురం రామ్మూర్తి, సుంకర చక్రధర్, సుదర్శన్‌రెడ్డి, కలప రవి, అమృతతేజ, శ్రీకాంత్, టిఎల్.వెంకటేష్, రామాంజులు, ముల్లంగి చంద్రయ్య, గుర్రం నారాయణ, ధరణికుమార్, సుభాష్, రఘునాథ్, విజయ్, మల్లికార్జున, రాజేశ్వరి, శ్రీనివాసులు, విశ్వనాథ, ఓబులేషు, నాగేంద్ర, ఆంజినేయులు, కొండయ్య, రవి, గురునాథ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : భర్త వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం మండలంలో జరిగింది. కోళ్లబైలు పంచాయతీ బాబూకాలనీకి చెందిన ఆసిఫ్ భార్య ప్రభావతి(25) భర్త ప్రతి రోజూ మద్యం తాగి ఇంటికి వచ్చి వేధిస్తున్నారు. దీంతో మనస్తాపం చెందిన ప్రభావతి ఇంటి వద్దే పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన స్థానికులు బాధితురాలిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం


నసీమా (ఫైల్)

నిమ్మనపల్లె : నెల రోజులుగా ఓ వివాహిత కనిపించడం లేదని కుటుంబసభ్యులు గురువారం స్థానిక మీడియాకు తెలిపారు. బోడిమల్లయ్యగారి పల్లెకు చెందిన హుస్సేన్ బీ, మహబూబ్‌ఖాన్ దంపతుల కుమార్తె నసీమా(21)ను తురకపల్లెకు చెందిన సుబహాన్‌ఖాన్‌కు ఇచ్చి ఐదేళ్ల కిందట వివాహం చేశారు. వీరికి కుమార్తె సహారా(4), కుమారుడు సాహిల్‌ఖాన్(3) ఉన్నారు. ఆగస్టు 22న రాత్రి 9గంటల సమయంలో నసీమా బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేసినట్లు తెలిపారు. మిస్సింగ్ కేసు నమోదుచేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారన్నారు. అయితే, అదృశ్యమై నెల రోజులు కావడంతో ఆమె ఆచూకీకై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు నిమ్మనపల్లె పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఫోన్ నెంబర్. 9440900706కు సమాచారం అందించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం


మృతిచెందిన చంద్రశేఖర్‌రెడ్డి (25)

కడప అర్బన్ : నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నబీకోటకు చెందిన చెన్నకేశవరెడ్డి కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి (25) దుర్మరణం చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. ఖాజీపేట మండలానికి చెందిన చెన్నకేశవరెడ్డి లారీడ్రైవర్ గా పనిచేస్తూ తన కుటుంబ సభ్యులతో నబీకోటలో నివాసముంటున్నాడు. పెద్ద కుమారుడైన చెన్నకేశవరెడ్డి ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో నబీకోటకు చెందిన తన స్నేహితుడు యువకిషోర్‌తో కలిసి బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై అలంకాన్‌పల్లె వైపు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నారు. మార్గమధ్యంలో వినాయక నగర్‌కు వెళ్లే దారిలో ఓ కారును ఓవర్ టేక్ చేయబోయి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్‌రెడ్డికి తీవ్రగాయాలు కాగా స్థానికులు వెంటనే రిమ్స్‌కు తరలించారు. చంద్రశేఖర్‌రెడ్డి చనిపోయాడని డాక్టర్లు నిర్ధారించారు. ద్విచక్ర వాహనం నడుపుతున్న యువకిషోర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చేతికొచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు బంధువులు, స్నేహితులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు తెలిపారు.

హోంగార్డు కుటుంబానికి సహచరుల ఆర్థికసాయం


చెక్కు అందజేస్తున్న జిల్లా ఎస్పీ ధీరజ్ కనుబిల్లి

రాయచోటి : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హోంగార్డు బి.ఈశ్వర్‌నాయక్ కుటుంబీకులకు ఎస్పీ ధీరజ్ కనుబిల్లి గురువారం ఆర్థికసాయం ఆర్థికసాయం అందజేశారు. మృతుని కుటుంబానికి అండగా నిలిచేందుకు అన్నమయ్య జిల్లా హోంగార్డులు ముందుకు వచ్చి ఒకరోజు వేతనాన్ని విరాళంగా ఇచ్చారు. ఇలా వచ్చిన రూ.2,32 172ల చెక్కును ఎస్పీ కార్యాలయంలో మృతుడి కుటుంబసభ్యులకు ఎస్పీ అందజేశారు. సహచరులు కుటుంబానికి అండగా నిలవడం గొప్ప విషయమని ఎస్పీ అభినందించారు. పోలీసులు కేవలం చట్టాన్ని కాపాడేవారు మాత్రమే కారని, ఒకరికొకరు అండగా నిలిచే కుటుంబీకులు అన్నారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎం.పెద్దయ్య, ఆర్‌ఎస్ఐ శ్రీనివాసులు, ఏఆర్‌ఎస్ఐ బాలాజీ, జూనియర్ అసిస్టెంట్ జయకుమార్, బాధిత కుటుంబ సభ్యులు, హోంగార్డులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల దొంగల అరెస్టు

ఎస్పీ ధీరజ్ కనుబిల్లి


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ధీరజ్ కనుబిల్లి

రాయచోటి : పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన ఇద్దరు అంతర్ జిల్లా దొంగలను అరెస్టు చేసినట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కనుబిల్లి తెలిపారు. వారి నుంచి రూ.4.70 లక్షల విలువైన ఆస్తులు రికవరీ చేసినట్లు ఆయన తెలిపారు. రాయచోటి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ చిన్నమండెం మండలం పడమటి కోన గ్రామానికి చెందిన రెపన బాలాజీ (19), మండెం సాయికుమార్ (28)లు బీటెక్ వరకు చదువుకున్నారని తెలిపారు. చిన్నమండెం మండల పరిధిలో జరిగిన దొంగతనాలపై ఆరాతీస్తున్న సమయంలో పోలీసులు వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. దొంగలించిన డబ్బులో కొంత ఆన్‌లైన్ బెట్టింగులకు ఖర్చు చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు. వారి నుంచి బంగారు నగలు, నగదు, సెల్ ఫోన్లు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. రాయచోటి అర్బన్ పోలీసు స్టేషన్, కడప చిన్న చౌక, కడప పాతబస్టాండ్ మరికొన్ని జిల్లాల పరిధిలో వారు దొంగతనాలకు పాల్పడినట్లు తమకు సమాచారం ఉందన్నారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన రాయచోటి డీఎస్పీ ఎంఆర్.కృష్ణమోహన్, రూరల్ సీఐ వరప్రసాద్, చిన్నమండెం ఎస్ఐ సుధాకర్, సిబ్బందిని ఎస్పీ ప్రశంసించారు.

మొన్న కుమార్తెలు.. నేడు తల్లి ఆత్మహత్య

నిప్పంటించుకొని షేక్ మహబూబ్ జాన్ మృతి


మృతి చెందిన మహబూబ్ జాన్ (49)

రాయచోటి : రెండు నెలల క్రిందట ఇద్దరు కుమార్తెలు, గురువారం తెల్లవారు జామున తల్లి మహబూబ్ జాన్ ఒకే ఇంటిలో శరీరంపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు సంచలనం కలిగించాయి. షేక్ మహబూబ్ జాన్ (49) గురువారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో శరీరంపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకుంది. రాయచోటి పూజారి బండ వీధిలోని సంగీత స్కూల్ సమీపంలో జరిగిన ఈ సంఘటన స్థానికులను కలవరపాటుకు గురిచేస్తోంది. ఈ ఏడాది జూలై 29న మహబూబ్ జాన్ కుమార్తెలు ఆఫ్రీన్, ఫాతిమాలు ఇదే ఇంటిలో నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అప్పట్లో ఈ సంఘటన అన్ని వర్గాల మనస్సులను గాయపరిచింది. రెండు నెలల తరువాత అదే ఇంటిలో తల్లి ఈ అఘాయిత్యానికి పాల్పడడం స్థానికుల హృదయాలను కలిచివేసింది. షేక్ మహబూబ్ జాన్ అఘాయిత్యానికి పాల్పడుతున్న సమయంలో భర్త హుస్సేన్ ప్రక్క గదిలో నిద్రపోతున్నట్లు సమాచారం. తమ పిల్లలు ఇద్దరి బాగోగులను తండ్రి హుస్సేన్ పట్టించుకోకపోవడంతోనే వారు చనిపోయారని, ఆ బాధతోనే తల్లి ఆత్మహత్య చేసుకున్నట్లు కొంతమంది స్థానికులు చెబుతున్నారు. అయితే భర్తే భార్యపై కిరోసిన్ పోసి నిప్పంటించి చంపేసి ఉంటాడన్న అనుమానాలు, మహబూబ్ జాన్ బంధువులు వ్యక్తం చేస్తున్నారు. సంఘటనపై పోలీసులు పూర్తిస్థాయిలో విచారణను చేపడితే అసలు విషయాలు బయటకు వస్తాయని స్థానికులు చెబుతున్నారు. ఈ సంఘటనపై రాయచోటి అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.


ఇరువర్గాల ఘర్షణ



గాయపడిన వెంగం వెంకటరమణ, గాయపడిన దక్షిణం వెంకటరమణ


మదనపల్లె రూరల్ : ఇరు వర్గాల ఘర్షణలో నలుగురు వ్యక్తులు గాయపడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మండలంలోని మాలేపాడు పంచాయతీ దొనబైలుకు చెందిన వెంగం శంకరప్ప(45), భార్య వెంగం మల్లీశ్వరి(40) పొలం వద్ద ఉండగా, పక్క పొలానికి చెందిన దక్షిణం వెంకటరమణ కుమారుడు దక్షిణం రామకృష్ణ ఆమె వద్దకు వచ్చి మాట్లాడుతున్న ఫోన్ లాక్కున్నారు. ఆమె భర్త శంకర తన భార్య ఫోన్ ఎందుకు లాక్కున్నావు.. తరచూ ఎందుకు ఫోన్ చేస్తున్నావంటూ నిలదీశాడు. ఇంతలో అక్కడకు వచ్చిన శంకర తమ్ముడు వెంగం వెంకటరమణ(35), రామకృష్ణతో గొడవకు దిగాడు. దీంతో రామకృష్ణ తండ్రి వెంకటరమణ, కుటుంబసభ్యులైన జయపాల్, రామలక్ష్మమ్మ తదితరులతో కలిసి గొడవపడ్డారు. మాటామాటా పెరగడంతో రామకృష్ణ తన కత్తితో శంకర తమ్ముడు వెంకటరమణపై దాడిచేయగా తలకు తీవ్రగాయమైంది. అంతేకాకుండా మరో వర్గంలోని దక్షిణం వెంకటరమణ సైతం గాయపడ్డాడు. ఇరువర్గాల్లో గాయపడిన వ్యక్తులను స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై తాలూకా పోలీసులు విచారణ చేస్తున్నారు.

జీవిత ఖైదీకి గోల్డ్ మెడల్


యుగంధర్ (ఫైల్)

కడప అర్బన్ : జీవిత ఖైదు అనుభవిస్తున్న గునుకుల యుగంధర్ డిగ్రీలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి గోల్డ్ మెడల్ సాధించారు. కడప కేంద్ర కారాగారం అధికారులు, యుగంధర్ తల్లి చెంగమ్మ, చెల్లెలు మేఘన వివరాల మేరకు.. కడప కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు అనుభవిస్తున్న యుగంధర్ ప్రస్తుత తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం జంగాలపల్లి నివాసి. 2011 జూలై, 18న హత్య కేసులో జీవిత ఖైదు విధించబడి కేంద్ర కారాగారానికి వచ్చాడు. అప్పటినుంచి ఓల్డ్ పాటర్న్‌లో రెండు బీఏ డిగ్రీలు, న్యూ పాటర్న్‌లో ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్(సీబీఎస్‌సి)లో రెండు బీఏ డిగ్రీలు, మూడు ఎంఏ డిగ్రీలు, కంప్యూటర్, కార్పెంటరీ, నాక్ స్కిల్స్‌లో సర్టిఫికెట్లు పొందాడు. ఇటీవల డిగ్రీలో 8.02 జీపీఏతో అత్యుత్తమ ప్రతిభ కనబరచి మంచి ర్యాంకు సాధించడంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ గోల్డ్ మెడల్, బుక్ ప్రైజ్ దక్కాయి. ఈ నెల 30న హైదరాబాద్‌లో మెడల్ అందుకోనున్నారు. ఇతడు మూడేళ్లపాటు పారా లీగల్ వలంటీర్‌గా పనిచేశారని కారాగారం అధికారులు తెలిపారు.


నా బిడ్డకు క్షమాభిక్ష పెట్టండి


మాట్లాడుతున్న యుగంధర్ తల్లి చెంగమ్మ, చెల్లెలు మేఘన

హత్య కేసులో 20 ఏళ్లుగా జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్న తన కుమారుడు యుగంధర్‌కు క్షమాభిక్ష పెట్టాలని అతడి తల్లి చెంగమ్మ, సోదరి మేఘన కోరారు. యుగంధర్ తెలిసి తెలియక హత్య చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. గోల్డ్ మెడల్ సాధించి సత్ప్రవర్తన కలిగి ఉన్నాడని.. ప్రభుత్వం గుర్తించి తన బిడ్డను విడుదల చేయాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.21 కోట్లు

డీపీహెచ్ఈవో సతీష్‌కుమార్


నీటి సమస్యపై సమీక్షిస్తున్న సతీష్‌కుమార్

మదనపల్లె : పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు రూ.21.93 కోట్ల కేటాయించినట్లు జిల్లా ప్రజారోగ్య ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.సతీష్ కుమార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో తాగునీటి సరఫరాపై గురువారం ఆయన సమీక్షించారు. పట్టణంలో ఎక్కడెక్కడ నీటి ఇబ్బందులున్నాయి? ఎలా సరఫరా చేస్తున్నారు? తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మదనపల్లె పట్టణానికి అమృత్ పథకం కింద రూ.21.93 కోట్లతో తాగునీటి పనులకు టెండర్లు పిలుస్తున్నట్లు తెలిపారు. చిప్పిలి సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకుకు పనులు పూర్తిచేసి అక్కడినుంచి నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పట్టణంలో రెండు, మూడు రోజులకోసారి నీటి సరఫరా చేస్తున్నామని, రాయచోటిలో మూడురోజులకోసారి నీటి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో డీఈ శ్రావణి, ఏఈ రవీంద్రనాయక్, ఫిట్టర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సామాజిక రుగ్మతలు తొలగించడమే లక్ష్యం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు విధులు నిర్వర్తించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సూచించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులలో బాధితులకు పరిహారం అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చిన్నయ్య, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, భావన, మురళి, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.